## ఐటీ కారిడార్‌లో మెట్రో లగ్జరీ బస్సు సేవలు

సిటీబ్యూరో, మార్చి 1 ( నమస్తే తెలంగాణ ): ఐటీ కారిడార్‌లో గ్రీన్ మెట్రో లగ్జరీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సు సేవలను మార్చి 3 నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూట్‌నెంబర్ 216 డబ్ల్యూ.. లింగంపల్లి నుంచి నల్లగండ్ల, గోపనపల్లి, విప్రో, ఖాజాగూడ ఎక్స్ రోడ్, దర్గా మీదుగా మెహిదీపట్నం వరకు నాలుగు గ్రీన్ మెట్రో లగ్జరీ బస్సులు సేవలు అందించనున్నాయి. రూట్‌నెం 216 జీ మార్గంలో లింగంపల్లి నుంచి లక్ష్మి నగర్ వరకు రెండు గ్రీన్ మెట్రో లగ్జరీ బస్సులు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. కాగా, లింగంపల్లి నుంచి మెహిదీపట్నం మొదటి బస్సు ఉదయం 6:50, చివరి బస్సు రాత్రి 10:10 వరకు ఉంటుంది. లింగంపల్లి –లక్షిగర్ మొదటి బస్సు ఉదయం 6:15 గంటలకు, చివరి బస్సు రాత్రి 11 గంటల వరకు ఉంటుంది.

## ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

సిటీబ్యూరో, మార్చి 1 ( నమస్తే తెలంగాణ ) : ఫెడరేషన్ ఆఫ్ ఎన్నారై కల్చరల్ అసోసియేషన్(ఎఫ్ఎన్ఏసీఏ) ఫ్రాన్స్, మలేషియా అంతర్జాతీయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది జీవిత సాఫల్య పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మిరియాల జానకీరామ వర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9666910480 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులు www.fncainternational@gmail.com కు పంపాలని కోరారు.

## ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి

### డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా

జూబ్లీహిల్స్, మార్చి 1: ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి బాటలు వేయాలని జీ హెచ్ ఎం సీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా కోరారు. శనివారం యూసుఫ్ గూడలోని జీ హెచ్ ఎం సీ కార్యాలయంలో ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహించారు. ఆస్తిపన్ను వివాదాలను మార్చి 31 వరకు ప్రతి శనివారం నిర్వహించే వేదికలో పరిష్కరించుకోవాలని కోరారు. ఫిబ్రవరి 28 తో ముగిసిన మలి విడత సమగ్ర కుటుంబ సర్వేకు 165 దరఖాస్తు లు వచ్చాయని డీ సీ జాకియా సుల్తానా తెలిపారు. తొలి విడత సమగ్ర సర్వేకు యూసుఫ్ గూడసర్కిల్ లో 59,900 పై చిలుకు దరఖాస్తులు వచ్చాయని, మలి విడత లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు డీ సీ తెలిపారు.

*జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం (శ్రీవారు కల్పవృక్ష, సర్వభూపాల వాహనంపై ఊరేగించారు. హరి నామసంకీర్తనలు, కోలాటాలు, నృత్యాలతో అధ్యాత్మికత వెల్లివిరిసింది. దారి పొడువునా భజనలు, భక్తి గీతాలతో భక్తులు సందడి చేశారు.*

*– బజారాహిల్స్, మార్చి1:*

# అందానికో రేటు!

- వయసు, ఆకర్షణే ప్రధానంగా యువతులకు గాలం..
- రూ.25వేలు నుంచి రూ.2లక్షల వరకు పలుకుతున్న ధర
- బర్మా, మయన్మార్ యువతులకు ఎక్కువ డిమాండ్

సిటీబ్యూరో, మార్చి 1(నమస్తే తెలంగాణ): అక్కడ అందానికో రేటు కడతారు. .. వయసుని బట్టి ధర నిర్ణయిస్తారు. యువతులు,మైనర్ బాలికల కుటుంబాల అవసరాలను బట్టి రేటులో తేడా చూపిస్తారు. ఏ దేశపు యువతులకైతే ఎక్కువగా ఎక్కడ డిమాండ్ ఉంటుందో ఆయా ప్రాంతాలకు రవాణా చేస్తారు. కోల్‌కతా కేంద్రంగా దేశంలోని ప్రధాన నగరాలకు జరుగుతున్న మానవ అక్రమ రవాణా దందా ఇది. చాదర్‌ఘాట్‌లో మూడురోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో నలుగురు బర్మా యువతులు, ముగ్గురు మైనర్లు వ్యభిచార కూపం నుంచి బయటపడ్డారు. అందులో ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా వారు బంగ్లాదేశ్‌కు సంబంధించిన వ్యక్తులుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులను పోలీసులు విచారించే క్రమంలో అక్రమరవాణాకు సంబంధించి సంచలన విషయాలు వెలుగుచూసినట్లు తెలిసింది. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి గుట్టుగా పశ్చిమబెంగాల్‌కు తీసుకొస్తారు. సిటీ పోలీసులు ఈ రెండేళ్ల వ్యవధిలో బర్మా, మయన్మార్‌కు చెందిన 40 మంది యువతులు, 10 మంది మైనర్లను వ్యభిచార కూపం నుంచి బయటపడేశారు. ప్రస్తుతం సుమారు 50మందికి పైగా ఇక్కడకు వచ్చినట్లు సమాచారం. వీరిని కూడా వారి వారి దేశాలకు పంపడానికి సిటీ పోలీసులు ప్లాన్ చేసుకుంటున్నారు.

### వారికే డిమాండ్ ఎక్కువ..!

విదేశాల నుంచి యువతులను, మైనర్లను తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ చెబుతారు. ఇందుకోసం వారి కుటుంబాలకు అడ్వాన్స్‌గా రూ.25 వేల నుంచి రూ.35వేలు చెల్లిస్తారు. మయన్మార్, బర్మా దేశాలకు చెందిన వారికి పెద్ద ఎత్తున డిమాండ్ ఉండడంతో వారి విషయంలో దళారులు ఆసక్తి చూపుతారని పోలీసుల విచారణలో తేలింది. ఇందుకోసం ఎన్ని డబ్బులైనా ఖర్చు పెడతారని, కుటుంబాలకు ఇచ్చే డబ్బుల కంటే ఇక్కడ తాము అమ్మిన చోట వచ్చే డబ్బులు ఒక్కొక్కరికీ రూ.70వేల నుంచి రూ.80వేల వరకు చెల్లిస్తున్నారు. అది కూడా వారి వయసు, అందాన్ని బట్టి రేట్ నిర్ణయమవుతుంది. మైనర్లయితే ఒక్కొక్కరికీ రూ.50వేల వరకు చెల్లిస్తారని తెలిసింది. ఢిల్లీ, హైదరాబాద్ , ముంబై, చెన్నై, బెంగళూరు, విశాఖలలో వీరి డిమాండ్ ఎక్కువగా ఉందని పోలీసుల విచారణలో నిందితులు చెప్పారు. విదేశాల నుంచి అక్రమంగా తెచ్చిన వారిని ఆయా నగరాల్లో స్పా సెంటర్లు, బ్యూటీపార్లర్లు, మసాజ్‌సెంటర్లు తదితర చోట్ల పెట్టి దందా నడిపిస్తున్నారు. వారి కుటుంబ అవసరాలను ఆసరాగా చేసుకుని కూడా రేట్లు నిర్ణయిస్తారని, ఈ విషయంలో కూడా రెండు మూడు ముఠాలు పోటీ పడుతున్నట్లుగా చెప్పినట్లు తెలిసింది. కేవలం వారం, పదిరోజుల కోసం విదేశీ యువతులకు ఒక్కో ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి రేట్లు నిర్ణయించి వీరికి విలాసవంతమైన జీవితాన్ని అందించి పనుల్లోకి దింపి వారికి కావాల్సిన సొమ్మును ఇస్తూనే తమ పబ్బం గడుపుకొంటున్నారు.

### కోల్‌కతా కేంద్రంగా..

ప్రధానంగా ఈ మానవ అక్రమరవాణా కోల్‌కతా కేంద్రంగా జరుగుతున్నది. పశ్చిమ బెంగాల్‌కు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి అక్కడ నకిలీ ఆధార్‌కార్డులు సృష్టించి బెంగాల్ వారి మాదిరిగా చెలామణి అవుతారు. పోలీసులు పట్టుకున్నప్పుడు కూడా వారు బెంగాల్‌కు చెందినవారిగానే ఆధారాలు చూపుతున్నా.. నకిలీలని తేల్చేసి అసలు విషయాలు రాబడ్తున్నట్లు పోలీసులు చెప్పారు. బంగ్లా నుంచి కొందరు మహిళలు, యువకులు కలిసి బెంగాల్‌లోకి సరిహద్దు గ్రామాలు, సొరంగాల ద్వారా చేరుకుంటారు. ఆ తర్వాత వారి ఐడెంటిటీ రూపొందించుకొని..బర్మా, మయన్మార్ నుంచి యువతులను, మైనర్లను ఉపాధి చూపిస్తామంటూ తీసుకొచ్చి డేటింగ్ యాప్‌లు, వ్యభిచార గృహాలకు పంపిస్తున్నారు. కోల్‌కతాలోని దళారులు ఐదారు గురు బర్మా, మయన్మార్ యువతులను, మైనర్లను వారికి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి వారం రోజులకు, పదిరోజుల కోసం అక్కడ పనిచేసేలా ఏర్పాటు చేస్తున్నారు. ఒకే చోట ఉంటే పోలీసులు అనుమానించే అవకాశం ఉండడంతో వారిని ఎప్పటికప్పుడు వేర్వేరు ప్రాంతాలకు మారుస్తున్నారు. నిర్వాహకులు మాత్రం విదేశీ యువతులు చేసే పనిలో వారికొచ్చే ఆదాయానికి తగ్గట్లుగా కమిషన్, నెలవారీ జీతం కూడా ఇస్తున్నారు. అందం, ఆకర్షణ, వయసు.. ఈమూడే ప్రధానంగా విదేశీ యువతుల, మైనర్ల అక్రమరవాణా కొనసాగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# బల్దియాలో భారీ బదిలీలు

### ఒకేసారి 139 మందిపై వేటు వేసిన కమిషనర్ ఇలంబర్తి

### శానిటేషన్ విభాగం ప్రక్షాళన పేరిట ఏండ్లుగా పాతుకుపోయిన సిబ్బందిపై చర్యలు

### కమిషనర్ చర్యలతో చెత్త నిర్వహణపై భిన్నాభిప్రాయం

సిటీబ్యూరో, మార్చి 1(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో శానిటేషన్ విభాగం ప్రక్షాళన పేరిట కమిషనర్ ఇలంబర్తి తీసుకున్న చర్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకేసారి 139 మందిపై బదిలీ వేటుతో బల్దియా సిబ్బందిని ఉలిక్కిపడేలా చేశారు. గ్రేటర్ మున్సిపల్ పరిధిలో మునుపెన్నడూ గంపగుత్తగా పారిశుధ్య విభాగంపై కమిషనర్ తీసుకున్న చర్యలు కుదిపేస్తుండగా... ఏళ్లుగా పాతుకుపోయిన సిబ్బందిపై బదిలీ వేటు పడింది. నగరంలో మొత్తంగా 269మంది శానిటేషన్ సిబ్బంది ఉంటే, ఐదేళ్ల కంటే ఎక్కువ కాలంగా ఒకే చోట తిష్ట వేసిన 139 మంది శానిటరీ జవాన్ల బదిలీపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఓవైపు బదిలీ జాబితాలో అవినీతి ఆరోపణలు ఉన్నవారే ఎక్కువగా ఉన్నారని, గంపగుత్త బదిలీతో వారి బాగోతాలకు చెక్ పడుతుందనీ అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోవైపు ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో సిబ్బందిని బదిలీ చేయడం ద్వారా నగరంలో చెత్త నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతుందని వాదిస్తున్నారు. ఇప్పటికే నగరంలో చెత్త నిర్వహణ అధ్వానంగా ఉన్న నేపథ్యంలో... కమిషనర్ తీసుకున్న కీలక నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

### మార్గదర్శకాలు పాటించాలని...

జీహెచ్ఎంసీ పరిధిలో ఎన్నడులేనట్లుగా భారీ సంఖ్యలో పారిశుధ్య సిబ్బందిపై బదిలీ వేటు వేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేయడం సంచలనంగా మారింది. అంతేకాదు ఈ బదిలీలను సర్కిళ్ల వారీగా చేసినందున పోస్టింగుల సమయంలోనూ తన మార్గదర్శకాలు పాటించాలని జోనల్ స్థాయి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని శానిటేషన్ విభాగంలో 259 మంది శానిటరీ జవాన్లు పనిచేస్తుండగా... ఇందులో 52శాతానికి పైగా గత కొంత కాలంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఐదేళ్ల కంటే ఎక్కువగా ఒకేచోట పనిచేస్తున్న వారిపై చర్యలతో... ఇప్పుడొక హాట్ టాపిక్‌గా మారింది.

### పారిశుధ్యం గందరగోళం...

అయితే ఒకేసారి వందలాది మంది శానిటేషన్ జవాన్లను బదిలీ చేయడంతో... నగరంలో చెత్త నిర్వహణ అధ్వానంగా మారుతుందనే అభిప్రాయపడుతున్నారు. పలు డివిజన్ల పరిధిలో ఇప్పటికే రోడ్లపై చెత్త పేరుకుపోయి కంపు కొడుతుంది. ఈ క్రమంలో సిటీలోని ఆయా డివిజన్ల పరిధిలో సమగ్రమైన అవగాహన కలిగిన వారందరినీ తొలగించి... కొత్త డివిజన్లకు బదిలీ చేయడం నిర్వహణపై ప్రభావం పడుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే గతంలో కూడా కమిషనర్‌గా పనిచేసిన అమ్రపాలి భారీ బదిలీలతో మార్క్ చూపే క్రమంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారనే కారణంతో చెత్త నిర్వహణలో కీలకమైన శానిటరీ సిబ్బందిపై తాజాగా వేటు వేయడం... ఎలాంటి పరిణామాలు చోటుచేసకుంటాయనేది ఆసక్తిగా మారింది.

## మహోన్నత గ్రంథం భారత రాజ్యాంగం

*స్మారక ఉపాన్యాసం ఇస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ నరేంద్ర దామోదర్ జాదవ్*

సిటీబ్యూరో, ఫిబ్రవరి01, (నమస్తే తెలంగాణ): భారత రాజ్యంగం ఈ దేశప్రజలందరికి మహోన్నత గ్రంథమని, రాజ్యాంగ స్ఫూర్తితో సమానత్వం, సామాజిక న్యాయం సాధించే దిశగా ముందుకు సాగాల్సిన బాధ్యత మనందరి భుజాలపై ఉందని మాజీ ఎంపీ డాక్టర్ నరేంద్ర దామోదర్ జాదవ్ గుర్తు చేశారు. శనివారం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్(జేకేఎంఆర్) ఆధ్వర్యంలో దోమలగూడలోని ఏవీ కళాశాలలో '55 ఏండ్ల రాజ్యాంగ నిర్మాణం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర' అంశం పై స్మారక ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన డాక్టర్ నరేంద్ర దామోదర్ జాదవ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

విభిన్న రంగాలకు చెందిన ఆలోచనాపరులు, ఆవిష్కర్తలు, నిపుణులను ఒకే వేదిక పైకి చేర్చుతూ అనురాగ్ యూనివర్సిటీ టెడ్ ఎక్స్‌అనురాగ్‌యూ2025 ని ఘనంగా నిర్వహించింది నెక్స్ట్ ఈజ్ నౌ అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సైయంట్ వ్యవస్థాపకులు డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ప్రముఖ నటి, బ్లూక్రాస్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల, మాజీ ఐఏఎస్ అదికారి జయప్రకాశ్‌నారాయణ్, పలు కంపెనీల ప్రతినిధులు రామకృష్ణ మోమిడి, రిద్దీష్ సోని, అగ్నివ్‌వి నోద్,శాండిల్య పిసాపాటి, కార్తీ సుబ్బరామన్, నిష్కయోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

*– సిటీబ్యూరో, మార్చ్ 1 (నమస్తే తెలంగాణ)*



*సమగ్రకుటుంబ సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, సర్వే పూర్తయిన ఇప్పటివరకు తమకు గౌరవ వేతనం ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఎనిమరేటర్లు, సూపర్‌వైజర్లు ఆందోళన చేపట్టారు. అనంతరం డీసీ నరసింహ కు వినతి పత్రం అందజేశారు.*

*-కుత్బుల్లాపూర్, మార్చి1*

## పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు

*సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్*

మేడ్చల్, మార్చి1(నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకున్న వారందరికీ సంబంధిత అధికారులు ఫోన్ చేసి ఈ నెల 31లోగా క్రమబద్ధీకరణ రుసుం చెల్లించినట్లయితే 25 శాతం వస్తుందని తెలపాలని సూచించారు. ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులలో నిబంధనల మేరకు అన్ని ధృవపత్రాలు ఉన్నట్లయితే దరఖాస్తుదారులకు ఫోన్ చేయాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఇందులో ఎన్ని పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వివరాలను మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి త్వరగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ క్రమంలో ప్రతిరోజు దరఖాస్తులపై పురోగతిని మెసేజ్ ద్వారా పంపించాలని సూచించారు. దరఖాస్తుదారుల క్రమబద్ధీకరణ రుసుం చెల్లించేందుకు ఆన్‌లైన్ ద్వారా లేదా వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల వద్ద చెల్లించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.

### వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లాలో వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ గౌతమ్ సూచించారు. బోర్లకు మరమ్మత్తులు చేయించాలని, అవసరమైన చోట వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## పార్కుల నిర్వహణలో బల్దియా విఫలం

*సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు*

బాలానగర్ : పార్కుల నిర్వహణలో బల్దియా పూర్తిగా విఫలమైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హెచ్‌ఎండీఏ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది నిధులు కేటాయించి పార్కులను అభివృద్ధి చేసి నిర్వహణ బాధ్యతలు జీహెచ్‌ఎంసీ కి అందజేయగా సంబంధిత అధికారులు ఆయా పార్కులను అధ్వానంగా తయారవ్వడానికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పనితీరు, పార్కులు నిర్వహణ లోపం కారణంగా ప్రజలు పార్కులకు వెళ్లడం లేదని తెలిపారు. ఐడీయల్ చెరువు దగ్గర ప్రజల సౌకర్యార్థం కోట్లాది నిధులతో పార్కును ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు జీహెచ్‌ఎంసీకి అప్పగించగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా తయారైందని పేర్కొన్నారు. అధికారుల పనితీరు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో 5 ఎకరాలలో క్రికెట్ స్టేడియం తో పాటు పార్కును అభివృద్ధి చేయడానికి సంకల్పించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గం లో అత్యధికంగా 8 చెరువులు ఉన్నాయని తెలిపారు. ఆయా చెరువుల సుందరీకరణ పనులు చేపట్టి పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## దక్షిణాదిపై హిందీని రుద్దితే యుద్ధమే

### ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: జాతీయ విద్యా విధానం పేరుతో హిందీని బలవంతంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దితే తిరుగుబాటు తప్పదని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ హెచ్చరించారు. బీజేపీ ఆధిపత్య ధోరణి నిర్ణయాలను ఎండగడతామన్నారు. తార్నాకలోని దక్షిణ భారత జేఏసీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉత్తరాది భాష హిందీని దక్షిణాదిపై రుద్దాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. జనాభా దామాషా పద్ధతిలో బడ్జెట్ కేటాయిస్తూ దక్షిణ భారతానికి తీవ్ర ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాదికి వేస్తున్న శిక్షగా దీనిని అభివర్ణించారు.

## ముగ్గురు గంజాయి విక్రయదారులు అరెస్ట్

### 3.4 కేజీల గంజాయి స్వాధీనం

సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను వేర్వేరు ప్రాంతాల్లో ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 3.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం (ప్రకారం... తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అల్లాది సాయి, నిజామాబాద్‌కు చెందిన నిర్ధి నవీన్‌కుమార్‌లు అమీర్‌పేట పరిసరాల్లో గంజాయి విక్రయిస్తుండగా శనివారం నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి 1.3 కిలోల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న రాజమండ్రికి చెందిన సంపత్‌పై కూడా కేసు నమోదు చేశారు. విచారణ నిమిత్తం కేసును అమీర్ పేట్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

### మరో కేసులో....

ధూల్ పేట్, జుమ్మెరాత్‌బజార్‌కు చెందిన నవీన్ కుమార్ కాటేదాన్‌లోని శ్రీరామ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు శనివారం నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 2.1 కేజీల గంజాయిని, సేల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం కేసును శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

# డైరెక్టర్ల నియామకమెప్పుడు..!

- నోటిఫికేషన్ ఇచ్చి 14 నెలలైనా ఊసేలేదు..
- ఇన్‌చార్జిలతో కొనసాగిస్తున్న టీజీఎస్పీడీసీఎల్
- విద్యుత్ సరఫరాపై మొక్కబడి పర్యవేక్షణ
- ప్రతీ ఫైల్ సీఎండీ కార్యాలయానికి వెళ్లాల్సిందే..
- ఇన్‌చార్జీలకు క్షేత్రస్థాయి అవగాహన లేదంటున్న ఉద్యోగులు

సిటీబ్యూరో, మార్చి1 (నమస్తే తెలంగాణ):టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో నిరంతరం నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగేలా చూడాల్సిన డైరెక్టర్ల నియామకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సాధారణంగా డైరెక్టర్లు విద్యుత్ సంస్థల పాలకమండలిలో సభ్యులుగా ఉంటారు. వీరు తమ పరిధిలోని డిస్కంలలో విద్యుత్ సరఫరా, నిర్వహణలపై పర్యవేక్షిస్తుంటారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో 24గంటల విద్యుత్ సరఫరాలో వీరి పాత్ర కీలకంగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే డైరెక్టర్లను తొలగించి వారిస్థానంలో సీజీఎంలు, సీఈ స్థాయి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాత కొత్త డైరెక్టర్ల నియామకానికి ఆయా సంస్థలు నోటిఫికేషన్ ఇచ్చాయి. నోటిఫికేషన్ ఇవ్వడం, దరఖాస్తుల స్వీకరణ శరవేగంగా పూర్తిచేసినా డైరెక్టర్ల నియామకం మాత్రం నెలలు గడుస్తున్నా జరగడం లేదు. కనీసం దరఖాస్తుల పరిశీలన కూడా జరగలేదని దరఖాస్తుదారుల్లో కొందరు చెబుతున్నారు.

### 14నెలలైంది.. ఇంకా భర్తీ చేయలేదు

గత సంవత్సరం జనవరిలో డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు సంస్థల్లో డైరెక్టర్లను నియమించేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో డైరెక్టర్ హైడల్, హెచ్‌ఆర్, కోల్, లాజిస్టిక్, థర్మల్, ఫైనాన్స్, కమర్షియల్, ఆడిట్ రంగాల్లో నిష్ణాతులైన వారి నుంచి దరఖాస్తులను కోరింది. సాధారణంగా టీజీఎస్పీడీసీఎల్‌లో ఏడుగురు డైరెక్టర్లను నియమించాలి. అయితే వాటిని ప్రాజెక్ట్స్, ఆపరేషన్స్, కమర్షియల్, ఫైనాన్స్ .. ఇలా నాలుగుకు కుదించారు. జనవరి చివరలో నలుగురిని తాత్కాలిక డైరెక్టర్లుగా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వారు పూర్తి స్థాయి డైరెక్టర్లు వచ్చే వరకు తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డైరెక్టర్ల పోస్టులకు సంబంధించి అప్లికేషన్లు కూడా బాగానే వచ్చాయి. దేశవ్యాప్తంగా పలు కేంద్రప్రభుత్వ రంగసంస్థలు, కేంద్రశాఖలు, ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని పలు శాఖల్లో పనిచేస్తున్న చీఫ్ ఇంజినీర్, చీఫ్ జనరల్ మేనేజర్లు, రిటైర్డ్ అధికారులు ఈ పోస్టులకు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో డైరెక్టర్ పదవీ కాలం రెండేళ్లు కాగా.. ప్రభుత్వం అవసరమని భావిస్తే తర్వాత మరో ఏడాది చొప్పున రెండు సార్లు పొడగించవచ్చని ఉమ్మడి రాష్ట్ర ఉత్తర్వులు ఉన్నాయి. అయితే సంవత్సరకాలంగా డైరెక్టర్లను నియమించకుండా తాత్కాలిక డైరెక్టర్లతో పనులు కొనసాగిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. కొత్త డైరెక్టర్ల నియామకం విషయం రాజకీయరంగు పులుముకోవడం సాధారణమే అయినా దీనికి సంబంధించినంతవరకు పెద్ద ఎత్తునే పైరవీలు జరుగుతున్నాయని తెలిసింది. ప్రభుత్వ పెద్దల్లో కొందరు తమకంటే తమకంటూ డైరెక్టర్ల భర్తీ విషయంలో పేచీ పడడంతో ఈ నియామకాలు పూర్తవట్లేదని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయినా ఈ ప్రభుత్వంలో డైరెక్టర్లే లేకుండా పూర్తిగా విద్యుత్ నిర్వహణపై పర్యవేక్షణ లేకుండా పోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెప్పారు.

### ఏ పనికైనా సీఎండీ కార్యాలయానికే

దక్షిణ డిస్కంలో ఆపరేషన్స్, హెచ్‌ఆర్/ఫైనాన్స్ విభాగాలకు రెగ్యులర్ డైరెక్టర్లు లేకపోవడంతో ఆయా విభాగాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా కీలక ఫైళ్లు ముందుకు వెళ్లాలన్నా ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆ ఫైళ్లను సీఎండీ కార్యాలయానికి పంపిస్తూ చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. దక్షిణ డిస్కం ఇన్‌చార్జి డైరెక్టర్లకు క్షేత్రస్థాయి అవగాహన లేకపోవడం మూలంగా క